"ఒరేయ్ సత్యం! నాన్నగారెలా ఉన్నారు?" అన్న నా ప్రశ్నకి వాడి నుంచి అలాంటి జవాబు వస్తుందని ఊహించలేదు.

"నువ్వేం దిగులు పడకురా శేషూ! ముసలోడు సెంచరీ కొట్టడం ఖాయం!" హేళనగా వాడన్న తీరుకి నా మనసు నొచ్చుకున్నట్లై తక్కున ఫోన్ పెట్టేశాను. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నేనీరోజు కేంద్ర ప్రభుత్వంలో ఆఫీసర్ హోదాలో ఉంటూ, మంచి జీవితం గడుపుతున్నానంటే ఆయన చలవే కదా!

పరమేశ్వరశాస్త్రిగారు నాకు పెదనాన్నగారవుతారు. కానీ నేనెప్పుడూ అలా భావించలేదు. 'నాన్నగారూ' అని పిలిచేవాణ్ణి. ఆయన కూడా అందరికీ మా అబ్బాయి అని చెప్పేవారే కానీ, మా తమ్ముడి కొడుకని ఎన్నడూ అనలేదు. ఏలూరులో డిగ్రీ పూర్తి చేసి ఏ పనీ లేక మూడు నెలలు ఖాళీగా ఉండిపోయాను. ఏదో శుభకార్యంలో పాల్గొనే పని మీద మా ఊరొచ్చిన పెదనాన్న, తిరుగు ప్రయాణంలో నన్ను తీసుకుని హైదరాబాద్ వచ్చారు. మా పెద్దమ్మ ఆకారం భారీగా ఉండటంతో నాకు భయంగా అన్పించేది. ఆమె మనసు వెన్న. కసురుకుంటూనే కొసరి కొసరి తిన్పించేది. బయటకి వెళ్తుంటే "ఒరేయ్ సన్నాసి, ఇలారా!" అని పిలిచి "ఆగు జేబులో నాలుగు రూపాయలు ఉండాలి బయట తిరిగే మనిషికి. ఖర్చుపెట్టుకో. అయిపోతే మళ్ళీ ఇస్తా! సరేనా?" అనేది. ఆ అభిమానానికి దండం పెట్టాలన్పించేది. నేను సరిగా తినకపోతే పెద్దమ్మ ఊరుకొనేది కాదు.

ఏదో ఒక ఉద్యోగం వెదుక్కోవాలి. వచ్చే సంపాదనని నాన్నకి పంపిస్తే ఆయనకు చాలా ఆసరా అవుతుంది. ఇదీ నా ఆరాటం. కోఠీలో ఓ లైబ్రరీలో తాత్కాలికంగా ఉద్యోగంలో చేరిపోయాను. కనీసం నా ఖర్చులకైనా వస్తే పెదనాన్నగారికి భారం కాకుండా ఉంటాను కదా అనేదే నా ఆలోచన. కానీ, పెద్దమ్మ ద్వారా ఆయనకి విషయం తెలిసి, ఉద్యోగం మాన్పించారు. నీకు మంచి భవిష్యత్ ఉంది అని టైపు నేర్పించారు.

మరోపక్క యు.పి.ఎస్.సి. పరీక్షలకి కోచింగ్ సెంటర్లో జాయిన్ చేశారు. ఇంటికి డబ్బు పంపాలనే ఆశ గమనించడంవలన ఆయనే నెలకి అయిదొందలు ఎం.వో. చేయడం ప్రారంభించారు.

"ఒరేయ్ శేషు! పెదనాన్న దేవుడు. ఆయనకి తన, పర భేదం లేదు. నాకంటే ఆయనే నీకు ముఖ్యుడు కావాలి" అని నాన్న చెప్పాడు. నేను మొహమాటపడే పరిస్థితి రాకుండా నా చొక్కాజేబులో ఎప్పటికప్పుడు ఖర్చయిన డబ్బుని తిరిగి భర్తీ చేస్తూ ఎప్పుడూ ఓ వంద రూపాయలు బ్యాలెన్సు ఉంచేవారు.

నేను సైకిల్ తొక్కడం నేర్చుకుంది హైదరాబాద్ వచ్చాకే. మా పెదనాన్నే దగ్గరుండి నేర్పించారు. ఆ సమయంలోనే కిందపడ్డ నా కాలు బెణికింది. ఆయనే రోజూ తైలం మర్దనా చేసేవారు. ఊహించని విధంగా గుండెనొప్పి పెద్దమ్మ ప్రాణాన్ని కబళించివేసింది. అప్పట్నుండి పెదనాన్నకి ఆదరణ కరువైంది. సత్యమూర్తి పెళ్లాం చెప్పుచేతల్లో ఉండి, కన్నతండ్రిని నిర్లక్ష్యం చేశాడు. ఒకసారి కబుర్ల మధ్యలో వాడు "పెదనాన్నని మీ ఇంటికి తీసుకెళ్ళు" అన్నాడు.

"ఈ క్షణమే తీసుకుపోనా?" అనేసరికి, నా స్పీడు చూసి వెనక్కి తగ్గాడు. ఒకరోజు రాత్రి పది గంటలకు తలుపు చప్పుడైతే, వెళ్ళి తీశా..ఆశ్చర్యం! పెదనాన్న..

"నాన్నగారూ! ఏంటి ఇంత రాత్రివేళ...?" అన్నాను.

"నిన్ను చూడాలన్పించింది...వచ్చేశాను" అన్నారు.

"అన్నట్టు తినడానికి బిస్కెట్లు, చాక్లెట్లూ, సమోసాలూ లేవా? ఐ లైక్ పెప్సీ" అన్నారు. ఆయన ఇష్టాలు తెలుసు కాబట్టి రెడీగానే ఉంచుతాం అలాంటివన్నీ. ఇలా ప్రయాణం పొడుగునా పెదనాన్నగారి జ్ఞాపకాలే గుర్తొచ్చాయి.

* * *

రాత్రి పదయింది. డ్రైవర్ లగేజీ అందుకొన్నాడు. "ఇసామియా బజార్‌కి పోనీ" చెప్పాను కారు కదలగానే.

తలుపు తీసేవరకూ నా వేలు కాలింగ్ బెల్ స్విచ్‌పైనే ఉంది.సత్యంతో పాటు వాడి భార్య వచ్చింది గాభరాగా తలుపు తీయడానికి.

"ఎక్కడ్రా పెదనాన్న? మా ఇంటికి తీసుకెళతా!" అన్నాను. వాడు మాటలు కూడబలుక్కుంటూ విషయం చెప్పాడు. చెంప ఛెళ్ళుమన్పించాలనిపించింది. వివరాలు కనుక్కుని, కారుని మేడ్చల్ దిక్కుగా పోనిమ్మన్నాను. సత్యంగాడిని అక్కడికక్కడే పీకపిసికి చంపితే పీడా వదిలేది. కన్న




తండ్రిని ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించడానికి మనసెలా ఒప్పింది వాడికి?

అడ్రస్ తెలిగ్గానే దొరికింది. మేనేజర్ క్వార్టర్ కూడా అక్కడే ఉంది. కాలింగ్ బెల్ చప్పుడుకి తలుపు తీశాడు. వివరాలు చెప్పేసరికి లోపలికెళ్లి ఓ ఉత్తరం తెచ్చిచ్చాడు. నాన్నగారి చేతి వ్రాతే అది.

'నాకోసం వెతకటం వృధా ప్రయాస, వెళ్ళాల్సిన చోటికి వెళ్తున్నాను. నాకు అక్కడ విశ్రాంతిగా ఉంటుంది. ఇక తిరిగిరాను...పరమేశ్వరశాస్త్రి' అని ఉంది. హైటెక్ సిటీ, శంషాబాద్..ఇలా రాత్రంతా తిరుగుతూనే ఉన్నాను నాన్నగారి సన్నిహితుల లిస్ట్ గుర్తు చేసుకుంటూ.

చివరికి ఇంటికెళ్ళాను. తలుపు తీసిన నా భార్య శారదతో ఏమీ మాట్లాడకుండా నేరుగా బెడ్‌రూంలోకి నడిచాను.అక్కడ....

నిజంగా అద్భుతమే. ఒక్కసారిగా ప్రాణం, మనసు, శరీరం తేలికపడ్డాయి. నాన్నగారు సుఖంగా నిద్రిస్తున్నారు. ఆయన పాదాల్ని కళ్లకి అద్దుకున్నాను. నా కళ్లు శారద కళ్లతో కలిశాయి. మా చూపులు ఒక్కటై ప్రశాంతంగా నిద్రిస్తున్న నాన్నగారిని అపురూపంగా చూస్తున్నాయి.

★